సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 132 | శనివారం, 20 సెప్టెంబర్ 2025 | పేజీలు : 4



## జనగామ సీఐ దామోదర్ రెడ్డిపై
# బదిలీ వేటు

- వీఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు
- ఆరోపణల కారణంగానే స్థానచలనమా..?
- స్థానికంగా చర్చోపచర్చలు..!
- నూతన సీఐగా సత్యనారాయణరెడ్డి నియామకం

జనగామ పట్టణ సీఐ సీఐ దామోదర్ రెడ్డికి స్థానచలనం కలిగింది. కొన్ని రోజులుగా ఆయనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ బదిలీ జరిగినట్టు స్థానికంగా చర్చించుకుంటున్నారు. నూతన సీఐగా వరంగల్ టాస్క్ ఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ సీపీ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

3



నూతన సీఐ సత్యనారాయణరెడ్డి



## వాళ్లది సంసారం.. వేరే వాళ్లది..
# వ్యభిచారమా..!
## బీఆర్ఎస్‌పై కడియం ఘాటు విమర్శలు

- నెలాఖరులో స్పీకర్‌కు వివరణ ఇస్తా..
- ఆయన నిర్ణయాన్ని బట్టి నా భవిష్యత్ కార్యాచరణ
- అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా..
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

2

'వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా..!' అంటూ మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నేతలను పరోక్షంగా విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చానని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. స్పీకర్ అందరికీ నోటీసులు ఇచ్చారని, దానికి వివరణ ఇచ్చేందుకు తనకు ఇంకా టైం ఉందని.. ఈ నెల ఆఖరు వరకు తన వివరణ స్పీకర్‌కు పంపిస్తానని తెలిపారు. ఆయన నిర్ణయం బట్టి తన భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడారు.

- మన చౌరాస్తా, హనుమకొండ ప్రతినిధి



3 లో

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జనగామ ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్

## అట్రాసిటీ కేసులపై
# స్పెషల్ ఫోకస్ పెట్టండి




4 లో



# వాళ్లది సంసారం.. వేరే వాళ్లది వ్యభిచారమా..!

## బీఆర్ఎస్ నేతలపై కడియం ఘాటు విమర్శలు

- **నెలాఖరులో స్పీకర్కు వివరణ ఇస్తా..**
- **ఆయన నిర్ణయాన్ని బట్టి నా భవిష్యత్ కార్యాచరణ**
- **అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా..**
- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం**

**మన చౌరాస్తా, హనుమకొండ ప్రతినిధి :** 'వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా..!' అంటూ మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నేతలను పరోక్షంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చానని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ అందరికీ నోటీసులు ఇచ్చారని, దానికి వివరణ ఇచ్చేందుకు తనకు ఇంకా టైం ఉందని.. ఈ నెల ఆఖరు వరకు తన వివరణ స్పీకర్కు పంపిస్తానని తెలిపారు. ఆయన నిర్ణయం బట్టి తన భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. పార్టీ మారిన వారిలో తానే మొదటి వాడిని కాదు, చివరి వాడిని కాదని అన్నారు. వ్యక్తిగతంగా నేను పార్టీ ఫిరాయింపులను సమర్థించనని, కానీ వ్యక్తి గత ఇష్టాయిష్టాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని భావించి వెళ్లానని తెలిపారు. తాను ఎవరి దగ్గర మోకరిల్లే వ్యక్తిని కాదని, కడియం శ్రీహరి ఎప్పుడూ ఐకాన్ గానే ఉంటాడని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న పదేళ్ళలో 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చారని కడియం గుర్తు చేశారు. అందులో ఏ ఒక్కరూ ఎందుకు రాజీనామా చేయలేదని మాజీ సీఎం కేసీఆర్ను ప్రశ్నించారు. వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా..! అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన కేసీఆర్ ఫామ్ హౌస్ లో పండుకుంటున్నాడని, అప్పుడు లేని విలువలు ఇప్పుడే వచ్చాయా అని ప్రశ్నించారు. కొంతమంది స్థాయిని మరచి సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలు కాకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయాలకు మంచిది కాదని హితవు పలికారు. వారి లాగా తనకు మాట్లాడటం వచ్చని కానీ తాను చదువుకున్న చదువు, సమాజంలో ఉన్న మర్యాద వల్ల మాట్లాడేందుకు సభ్యత అడ్డువస్తుందన్నారు. వారి వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. 15ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉండి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ, చిలిపి పనులు చేసి దళిత బంధు అమ్ముకుని, బి ఫాం అమ్ముకున్న వ్యక్తులు ఈ రోజు సుద్దపూసల లాగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ విధానాల పై, అభివృద్ధి పనుల పైన మాట్లాడితే సమాధానం చెప్పవచ్చు కానీ ఇలాంటి దిగజారుడు మాటలకు ఎలాంటి సమాధానం చెప్పాలని అన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్లే రాజకీయాలు భ్రష్టు పడుతున్నాయని విమర్శించారు. ఢిల్లీలో ఇంటిఇంటికి తిరిగి పార్టీలో చేర్చుకోమని అడిగితే తిరస్కరించిన వ్యక్తి.. ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎవరెన్ని వ్యక్తిగత దూషణలు చేసినా వాటికి వెరవకుండా ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కడియం శ్రీహరికి ఈ హోదా, పేరు ఉందంటే దానికి కారణం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు పెట్టిన భిక్ష మాత్రమే అన్నారు. స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, ఉపాధ్యక్షుడు లింగాల చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలో 250 మందికి ఉద్యోగాలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళలో 16 విభాగాల నుండి వివిధ కంపెనీలలో డిగ్రీ, బీటెక్, ఫార్మసీ విద్యార్హతలు కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఉద్యోగమేల ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు మన వద్దకే వస్తున్నాయని కళాశాలలో ప్రతి నెలజాబ్ మేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు చాలామంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు




దొరికినాయని, ఇకముందు కూడా వివిధ కంపెనీలతో ఎంఓయు కుదుర్చుకొని కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే దిశగా తగు చర్యలు చేపడతామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో నిర్మాణ్ సమస్త సీఈవో సందీప్ మాట్లాడుతూ 16 కంపెనీల నుండి ప్రతినిధులు ఇక్కడికి వచ్చారని వారికి అవసరమైన మేరకు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. కళాశాల ఉద్యోగ కల్పన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ ఈ మెగా ఉద్యోగ మేళ లో కళాశాలలోని విద్యార్థులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని మూడు రోజులపాటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చామని దీని ద్వారా ఇంటర్వ్యూ చేసే విధానాన్ని నేర్పించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలతో ఎం ఓ యు కుదుర్చుకొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహ్మాన్, డాక్టర్. వరలక్ష్మి, డాక్టర్. పి. సరిత, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఏ సరిత పాల్గొన్నారు.




## నమిలె సుమన్‌కు అరుదైన గౌరవం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ధర్మకంచ కాలనీలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన నమిలె ఎల్లయ్య - బలమణి దంపతుల కుమారుడు నమిలె సుమన్కు అంతర్జాతీయ స్థాయిలో మరో గొప్ప గౌరవం దక్కింది. ఈ నెల 18 నుంచి 20 వరకు మలేసియాలోని యూనివర్సిటీ టెక్నాలజీ మరాలో జరగనున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు. ఈ సదస్సులో ఆయన 'ఎఫెక్ట్స్ ఆఫ్ మెథడ్స్ ఆన్ ట్రైబల్ అండ్ నాన్ ట్రైబల్ యూనివర్సిటీ అథెట్స్..' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. సుమన్ కాకతీయ యూనివర్సిటీలో బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసి, అథ్లెటిక్స్ రంగంలో విశేష ప్రతిభ కనబర్చారు. అథ్లెటిక్స్ పోటీలలో రాష్ట్ర జాతీయ స్థాయిలలో గోల్డ్ మెడల్స్ సాధించి తన ప్రతిభను నిరూపించారు. ప్రస్తుతం నమిలే సుమన్ నిట్ ప్రొఫెసర్ పి.రవికుమార్ పర్యవేక్షణలో పరిశోధన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.




## కడియం గారూ.. నీ రాజీనామా ఎప్పుడు?

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం రఘునాథపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కడియం రాజీనామా చేయాలంటూ వెలసిన రాజకీయ పోస్టర్లు కలకలం రేపాయి. బీ ఆర్ ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాల్ పోస్టర్లు అతికించడంతో పట్టణ ప్రజల దృష్టి అంతా ఒక్కసారిగా అక్కడికే మళ్లింది. "కడియం గారు నీ రాజీనామా ఎప్పుడు..?" అనే వాక్యాలతో ఉన్న పోస్టర్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీ ఆర్ ఎస్ కార్యకర్తల చెమట కష్టం వల్లే ఎమ్మెల్యే కుర్చీ దక్కిందని, వెంటనే ఆ పదవికి రాజీనామా చేసి ఆ తర్వాత ఏ పార్టీ నుండైనా పోటీ చేయాలని బహిరంగ డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను విస్మరిస్తూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం మాత్రమే రాజకీయాలు చేయడం అన్యాయమని, ఇలాంటి వైఖరిని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని పోస్టర్లలో ఘాటుగా పేర్కొన్నారు. పోస్టర్ల అతికింపుతో రఘునాథపల్లి మండల కేంద్రంలో ఒక్కసారిగా రాజకీయ చర్చలు ముమ్మరం అయ్యాయి. స్థానిక నేతల నుంచి సామాన్య ప్రజల వరకు అందరూ ఈ పరిణామంపై స్పందిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పోస్టర్ రాజకీయాలు ఇంకా ఎలాంటి మలుపులు తిరుగుతాయో చూడాల్సి ఉంది.

## జనగామ సీఐ దామోదర్ రెడ్డిపై

# బదిలీ వేటు

- వీఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు
- ఆరోపణల కారణంగానే స్థానచలనమా..?
- స్థానికంగా చర్చోపచర్చలు..!
- నూతన సీఐగా సత్యనారాయణరెడ్డి నియామకం



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ పట్టణ సీఐ పి.దామోదర్ రెడ్డికి స్థానచలనం కలిగింది. కొన్ని రోజులుగా ఆయనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బదిలీ వేటు పడిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. నూతన సీఐగా వరంగల్ టాస్క్ ఫోర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ సీపీ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆరోపణలే కారణమా..?

ప్రస్తుతం జనగామలో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దామోదర్ రెడ్డి కొన్ని రోజులుగా పలు ఆరోపణల ఎదుర్కొంటున్న నేపథ్యంలో సీపీ వీఆర్‌కు బదిలీ చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల కాలంగా మీడియా, పలు దినపత్రికల్లో సీఐపై వచ్చిన కథనాలు, ఆరోపణలపై వరంగల్ సీపీ ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించినట్లు సమాచారం. పలు సివిల్ కేసుల్లో తలదుర్చి బాధితులకు న్యాయం చేయకుండా ధనార్జన ధ్యేయంగా పని



నూతన సీఐ సత్యనారాయణరెడ్డి

చేసినట్టు సీపీకి ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. ఇక మండలంలో జరుగుతున్న మట్టి, ఇసుక మాఫియా, వైన్స్, బెల్ట్ షాపుల్లో నెలవారి మామూళ్లకు తెరలేపరనే పలు ఆరోపణలు కూడా వెల్లినట్టు సమాచారం. జనగామకు చెందిన ఓ లీడర్ భూ తగాదా కేసులో తలదుర్చి అక్రమ కేసు నమోదు చేయడంతో ఆయన సీపీకి ఫిర్యాదు చేశాడు.. దీనిపై కూడా విచారణ జరిపించినట్టు విశ్వసనీయ సమాచారం. సీఐ తీరుపై పోలీస్ శాఖలో సైతం చర్చనీయాంశమైనట్లు తెలుస్తోంది. ఆయనకు అనుకూలంగా కొందరు ఎస్సైలు, పోలీసులు సిబ్బంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై వారిపై జిల్లా అధికారులు సీరియస్ అయినట్టు తెలిసింది. ఫిర్యాదుల విషయంలో బాధితులకు న్యాయం చేయకపోగా కొందరి పలుకుబడిని ఆసరా చేసుకుని సెటిల్మెంట్లు చేసి అక్రమ కేసులు బనాయించడంలో సీఐ నేర్పరి అని ముద్ర వేసుకున్నాడని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, నూతనంగా జనగామకు వస్తున్న సత్యనారాయణరెడ్డి గతంలో భద్రాచలం, ఖమ్మం, చేర్యాల, సుబేదారి సీఐగా విధులు నిర్వర్తించారు.



## నిరాదరణకు గురైన బాలలకు

# విద్యనందించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, మన చౌరాస్తా :** నిరాదరణకు గురైన బాలలకు విద్య అందించుట అందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్లోని ఎనుమాముల ఎన్టీఆర్ నగర్ నందు మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ కు వలస వచ్చి తల్లిదండ్రులతోపాటు విద్యా వసతులు లేకుండా ఉండి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బాలలకు ఈరోజు ఎడ్యుకేషనల్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రి నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఆంటీ హ్యూమన్ ట్రాఫిక్కింగ్ యూనిట్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. చదువుతోనే బాలలకు బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. పాఠశాలలో బీహార్, ఒరిస్సా ప్రాంతం నుంచి వచ్చిన సుమారు 62 మంది పిల్లల్ని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో అడ్మిట్ చేసి వారికి కావలసిన పూర్తి సహకారాలను అందిస్తామని తెలిపారు. వరంగల్ ఈస్టు జోన్ డిప్యూటీ కమిషనర్ పోలీస్ అంకిత్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి చొరవ తీసుకోవడం అనేది తెలంగాణ రాష్ట్రంలో ప్రథమం అని దీని కొనసాగింపుగా ఇతర వర్క్ సైట్లల్లో కూడా పిల్లలకందరికీ చదువుకునే లాగున పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని దీనికి దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సేవా సంస్థ వరంగల్ సహాయంతో పిల్లలకు ఉచితంగా బ్యాగులు పుస్తకాలు ఇతర సామాగ్రిని అందించారు. ప్రత్యేకంగా డాన్ బాస్కో సహకారంతో ఇద్దరు టీచర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మామునుర్ ఏసీపీ వెంకటేష్, ఏనుమాముల ఎస్హెచ్వో సురేష్ కుమార్, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్స్పెక్టర్ జె శ్యాంసుందర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ వి వసుధ, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, డాన్ బాస్కో ఎన్జీవో ఫాదర్ కోసి, సంస్థ కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, ఎం అజయ్ కుమార్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ సిబ్బంది ఎస్ఐ సుధాకర్, శ్రీనివాస్, రామారావు, భాగ్యలక్ష్మి సమయుద్దిన్, పాషా తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ పండుగకు

# అన్ని ఏర్పాట్లు చేయాలి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సేవాపక్షంలో భాగంగా మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస వర్మకి బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ 9 రోజుల వేడుక తెలంగాణ మహిళల ఆత్మగౌరవ బతుకమ్మ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో వీధి దీపాలు, వీధుల పరిశుభ్రత గుర్తించి సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుడికుడి మల్లేశం, దండ్యాల బిక్షపతి రెడ్డి, వగలబోయిన నారాయణ, బ్రాహ్మణపల్లి బాబు, గీత సెల్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కల్ దేవి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు మద్దికుంట కరుణాకర్, ఈగ కనకయ్య, యువమోర్చా మండల అధ్యక్షులు సానాది కరుణాకర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బచ్చలి రాజు, మండల కార్యదర్శి కొంతం రాజు, బూత్ అధ్యక్షులు దండు బాలచందర్, చల్లా రమణారెడ్డి, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి నరేడ్ల నరేందర్ రెడ్డి, బక్కి బాలనర్సు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం అందించాలి

## ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం జనగామ మండలం ఓబుల్కేశ్వపూర్ పీహెచ్సీని ఇంచార్జ్ కలెక్టర్ ఆకస్మికంగా తనికి చేశారు. ముందుగా డ్యూటీ డాక్టర్ల రిజిస్టర్, ఒపీ, ఇన్ పేషంట్ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. స్వస్థ నారీ సశక్తి పరివార్ అభయాన్ ప్రోగ్రాంలో భాగంగా పీహెచ్సీలో ప్రముఖ డెంటల్ డాక్టర్ చే ఎస్పెషాలిటీ రోజు నిర్వహిస్తున్న క్లినిక్ ని ఇంచార్జ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎన్ఎస్పీఏ స్పెషాలిటీ ఒపీ సేవలు ప్రతీ గ్రామంలో అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ సర్వీసెస్, ఓపీ, ఇన్ పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంహెచ్వో మల్లికార్జునరావు, డ్యూటీ డాక్టర్లు ఉన్నారు.



## న్యాయవాదుల రక్షణ

# చట్టాన్ని తేవాలి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ కోర్టు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెట్రోపాలిటన్ కోర్టు న్యాయవాది అరుణ్ కుమార్, మరియు ఇతర న్యాయవాదులపై జరిగిన దాడిని హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖండిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని ధర్నా చేస్తుంటే పోలీసులు ఆయనను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చి, అక్రమంగా అరెస్టు చేసిన న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

# హుస్నాబాద్‌లో చిత్రలేఖన పోటీలు

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్లో ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షురాలు కాదాసు దీపికా, మహిళా మోర్చా నాయకురాలు లకావత్ శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థిని కె. వెన్నెల, రెండో బహుమతి సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థిని బి. రిషికా, మూడో బహుమతి టీఎస్ మైనారిటీ స్కూల్ విద్యార్థిని జీ. నేత్ర అందుకున్నారు. కాన్సొలేషన్ బహుమతులుగా పెన్స్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, పలువురు నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రైతాంగంపై నిర్లక్ష్య వైఖరి వీడాలి

**వరంగల్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో రైతంగం పట్ల, వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య పూరిత విధానాలు విడనాడాలని ఎ.ఐ.యు.కె.ఎస్. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ మండల కేంద్రంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ లో రైతాంగానికి సరిపడా యూరియా మరియు డి.ఏ.పి. అందించాలని డిమాండ్ చేస్తూ మండల ఏ.ఈ.ఓ. ప్రకాశ్కు ప్రతినిధి బృందంగా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ లబ్ధి పొందేందుకు తెలంగాణ రైతాంగానికి సరిపడ యూరియా డిఏపి అందించకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదన్నారు.



# అట్రాసిటీ కేసులపై పరిష్కారంలో
# ప్రత్యేక చొరవ తీసుకోవాలి

## వరంగల్ కలెక్టర్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మన చౌరాస్తా :**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని.. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, గత సమావేశంలో చర్చించి తీసుకొన్న చర్యల గురించి వివరిస్తూ, ప్రస్తుతం 26 కేసు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని అన్నారు. ప్రతీ నెల తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించే సమావేశానికి తహసీల్దార్, ఎస్హెచ్ఓలు సంబంధిత శాఖల అధికారులు హాజరవ్వాలని కలెక్టర్ అన్నారు. గ్రామల్లో గుడుంబా, గంజాయి అరికట్టుటకు ఎక్సైజ్ అధికారులు శ్రద్ధ పెట్టాలని అన్నారు. కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరపున బాధితులకు తప్పనిసరిగా పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాట్లాడుతూ ప్రతినెలా సివిల్ రైట్స్ డే అధికారులు అందరు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష లో జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య , సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళి , డీఈఓ రంగయ్య నాయుడు, డిడబ్ల్యూఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి , ఉమారాణి, ఏసీపీ లు రవీందర్, వెంకటేష్ ఎస్ హెచ్ వో లు విజిలెన్సు, మానిటరింగ్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్, చిన్న స్వామి, యాదగిరి, మహేందర్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.






# మున్నూరు కాపు సమస్యలపై మంత్రికి పొన్నంకు వినతి

**హుస్నాబాద్, మన చౌరస్తా :** మున్నూరు కాపు సమాజానికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికై మున్నూరు కాపు రాష్ట్ర నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు వృత్తి విద్యా కోర్సులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, కోకపేటలో మున్నూరు కాపు అభివృద్ధి కోసం కేటాయించిన 5 ఎకరాల భూమిలో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు, అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఈశంపల్లి వెంకన్న, ఆకుల సతీష్, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలపై అవగాహన

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్కు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ ఎల్. కృష్ణలతో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ పద్మజల బృందం శుక్రవారం భీమదేవరపల్లి మండలాన్ని సందర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా ఈ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి, కంది పంటల విత్తనోత్పత్తి ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచుకుని యూరియా వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల వ్యవసాయ అధికారి పద్మ, విస్తరణ అధికారిణి సుమలత, రైతు నాయకుడు బొక్కల జేమ్స్ రెడ్డి పాల్గొన్నారు.



# ముల్కనూర్ సొసైటీ సహకార యాత్ర

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** దేశంలో సహకార స్ఫూర్తి, గ్రామీణ అభివృద్ధి అనగానే గుర్తొచ్చే పేరు ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ. రైతుల చెమట బొట్లు నమ్మకంగా మలిచిన ఈ సంస్థ 69 ఏళ్లుగా నిరంతర సేవా ప్రస్థానం సాగిస్తోంది. శుక్రవారం ముల్కనూర్ పార్బాయిల్డ్ రైస్ మిల్లులో జరిగిన వార్షిక మహాసభ ఈ ఆవేశాన్ని మరోసారి రుజువు చేశారు.ఈ ఏడాది సొసైటీ రూ.407 కోట్ల వ్యాపారం జరిపింది. రైతుల అవసరాలను తీర్చడానికి రూ.242 కోట్ల రుణాలు అందించడం ద్వారా వనరుల కొరత లేకుండా చేసింది. సంస్థకు రూ.7.18 కోట్ల లాభం నమోదు కాగా, అందులో రూ.3.75 కోట్లను నేరుగా సభ్యులకు బోనస్ రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు .మహాసభలో రైతు సంక్షేమ పథకాలు ప్రత్యేక చర్చనీయాంశమయ్యాయి. దహన సంస్కార సహాయం రూ.83 లక్షలు,పంట అప్పు మాఫీ రూ.1.23 కోట్లు, స్కాలర్షిప్లు రూ.20 లక్షలు, పెన్షన్ రూ.71 లక్షలు మొత్తం రూ.13 కోట్లకు పైగా నేరుగా రైతుల సంక్షేమం కోసం వెచ్చించడం, సహకార సంస్థలకే ఒక ఆదర్శంగా నిలుస్తోందన్నారు.రైతులు ఆందోళన చెందే కాలం విత్తన, ఎరువు కొరత సమయమే. ఈ సారి 40 వేల యూరియా బస్తాలను సమయానికి సరఫరా చేసి రైతుల భుజం తట్టి నిలిచింది ముల్కనూర్ సొసైటీ అని అన్నారు.సొసైటీ భవిష్యత్ అభివృద్ధి దిశగా కూడా అడుగులు వేస్తోంది. రత్నగిరి, జగన్నాథపూర్ గ్రామాల్లో కొత్త గోదాములు, ప్రధాన కార్యాలయంలో డైనింగ్ హాల్ నిర్మాణానికి పాలకవర్గం సన్నాహాలు పూర్తి చేసింది. ఇది రాబోయే రోజుల్లో రైతులకు మరింత సదుపాయాలను అందించనుందన్నారు. సాధారణ రైతుల పొదుపు, రుణ సహాయం నుండి పెద్ద మొత్తాల మార్కెటింగ్ వరకూ - ముల్కనూర్ సొసైటీ ప్రతి అడుగులో రైతులకే అండగా నిలుస్తూ వస్తోంది. సహకార స్ఫూర్తిని కాపాడుకుంటూ 69 ఏళ్లుగా రైతు విశ్వాసానికి నిలువుటద్దంగా కొనసాగుతోందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిఎం రామ్ రెడ్డి, ఏజీఎం సతీష్, ఉపాధ్యక్షుడు గజ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

